# వాళ్ళూ-మనం

## 'అనామకుడు'



"అక్కా! నాన్న పిలుస్తున్నారు" అంటూ అరిచింది సరస్వతి కింద నుండి.

డాబామీద చాప వేసుకుని వెల్లకిలా పడుకుని, ఆకాశంలోని నక్షత్రాలను చూస్తూ - ఇది అని దేని గురించి కాకుండా ఏదో ఆలోచనల్లో మునిగిఉన్న లక్ష్మికి ఆ కేక వినిపించలేదు.

డాబా మెట్లని పరిగెత్తుతున్నట్లు ఎక్కి, అక్క పక్కకి చేరి, చెవిలో అవే మాటలు మళ్ళీ అరిచింది సరస్వతి

- "ఎందుకేమిటి?" లేస్తూ అంది లక్ష్మి.

"నాకేం తెల్సు?" తనకి తెల్సునన్న విషయాన్ని చిరునవ్వుతో తెలియజేస్తూ అంది సరస్వతి-

-అంటూనే అక్క చేతిని పట్టుకుని కిందకి లాగుతున్నట్లు దిగసాగింది

అదే సమయానికి "పెద్దక్కా! చిన్నక్కా!" అంటూ అరుస్తూ మెట్లు ఎక్కి పైకి వస్తూ, లక్ష్మి నొక్కసారిగా వాటేసుకుని-

"నీ పెళ్ళి ఇంజనీర్ బావతో కుదిరిపోయింది అమ్మ ఎంత ఆనందంగా ఉందో నాన్నైతే ఇంక చెప్పక్కర్లేదు" అంది పార్వతి

"తెలియదంటావేం సరూ" అంది లక్ష్మి సరస్వతి వంక చూస్తూ

"అక్క కప్పుడే సిగ్గొచ్చేస్తోంది" అంది సరస్వతి

"చిన్న పిల్ల దగ్గర ఆ మాటలేంటి?" కసురుతున్నట్లు అంది లక్ష్మి సరస్వతితో

సరస్వతి పార్వతి వంక చూస్తూ నవ్వింది

"ఎన్నేళ్ళొచ్చినా నన్ను చిన్న పిల్లనే అంటుంది అక్క- నాకు మొన్నటితో పద్దెనిమిదేళ్ళొచ్చాయా- అయినా అంతే" అంది పార్వతి.

"లక్ష్మీ! అక్కడా కబుర్లేంటి దిగిరండి" అంది కిందినుండి అన్నపూర్ణ.

"అమ్మకి అక్కని చూడాలని ఎంత ఆదుర్దానో - వెళ్ళమ్మా! నీ కోసమే ఆ పిలుపు" అంది సరస్వతి

ఇద్దరితోటీ కిందికి దిగింది లక్ష్మి.

లక్ష్మిని దగ్గరగా తీసుకున్నాడు సుబ్బారావు

"చూసిన మొదటి సంబంధమే కుదరడం లక్ష్మి అదృష్టం" అంది అన్నపూర్ణ.

"అక్కని చేసుకోడం బావ అదృష్టం" అంది సరస్వతి.

"అదీ సరయిన మాట, మీ అమ్మకి ఆమాత్రం కూడా తెలియడంలేదు" అన్నాడు సుబ్బారావు

"అక్కేమీ మాట్లాడ్డం లేదేం" అంది పార్వతి

"అదేం మాట్లాడుతుంది? అప్పుడే అది ఇంజనీర్ గారింట్లో ఉంది. ఇంక మనతో ఏం మాటలు?" అంది అన్నపూర్ణ

లక్ష్మి కళ్ళలో నీళ్ళు తిరిగాయి

సుబ్బారావు ఒళ్ళో తలవాల్చుకుని ఏడవడం మొదలు పెట్టింది

లక్ష్మి తలని నిమురుతూ అన్నాడు సుబ్బారావు- "పూర్ణా నీ కెప్పుడేం మాట్లాడాలో తెలీదే- పిల్ల నేడిపించావు"

"నేనేమన్నాను - ఉన్నమాటేగా అయినా ఇలాంటి వాటికే ఏడిస్తే ఎలాగే అమ్మాయీ! అక్కడి కెళ్ళాక అదే జీవితం అనుకోవా చెప్పు" అంది లక్ష్మిని దగ్గరకు తీసుకుంటూ అన్నపూర్ణ.

"నే నెప్పటికీ మీకు దూరంగా ఉండలేనమ్మా. నా కసలు పెళ్ళి చెయ్యొద్దు" అంది లక్ష్మి అన్నపూర్ణ మీదకి వాలుతూ ఇంకా ఏడుస్తూనే.

"తప్పమ్మా! అలా అనకూడదు. నువ్వు పెళ్ళి చేసుకుని, మీ ఆయనా పిల్లలతో సుఖంగా ఉండడమే మాక్కావలసింది" అన్నాడు సుబ్బారావు.

"పిచ్చిపిల్లా - ఇప్పుడిలానే అనిపిస్తుంది. కొన్నాళ్ళాగు" అంది అన్నపూర్ణ

"అదిగో మళ్ళీ- అసలే అది ఏడుస్తుంటే నువ్వు మళ్ళీ ఆమాటే అంటావు" అంది విసుగ్గా పార్వతి.

లక్ష్మి ఏడుపును చూస్తూ తనూ కళ్ళు తుడుచుకోసాగింది పార్వతి.

లక్ష్మిని దగ్గరకు తీసుకుని అంది సరస్వతి "నువ్వేడిస్తే నాకూ ఏడుపొస్తోంది. నే నేడవడం నీ కిష్టం లేదుకదా! మరి మానెయ్యి. చూడు చెల్లి కూడా ఏడుస్తోంది"

లక్ష్మి లోపలికెళ్ళి మొహం కడుక్కునొచ్చింది.

"రండి, భోంచేద్దాం" అంది అన్నపూర్ణ

భోంచేస్తూ మధ్యలో అడిగింది లక్ష్మి-

"నాన్నా కట్నం ఎంతేమిటి?"

"నీకెందుకమ్మా అవన్నీ. ఆ విషయం మేం చూసుకుంటాంగా" అన్నాడు సుబ్బారావు

"అసలు చెప్పచ్చుగా" అంది లక్ష్మి.

"వాళ్ళ కసలు కట్న కానుకల గురించి తెలిసినట్లు లేదు ఏదీ సరిగ్గా అడగలేదు" అంటోంది అన్నపూర్ణ అది పూర్తి కాకుండానే-

"ఎంతో చెప్పకుండా ఈ మాటలన్నీ ఎందుకు?" అంది లక్ష్మి

"పాతికవేలమ్మా" అన్నాడు సుబ్బారావు

"అన్ని వేలే" అంది లక్ష్మి.

"ఇంజనీర్లకి అది తక్కువేనమ్మా అందులోనూ అతను పబ్లిక్ సెక్టర్ కంపెనీలో ఉన్నాడు జీతం మంచిది. ఎంతలేదన్నా యాభై వేలిచ్చే వాళ్ళుండచ్చు"

"మరంత తక్కువే అడిగారేం" అంది పార్వతి వెటకారంగా, తక్కువని ఒత్తి పలుకుతూ

"లాంఛనాలు కూడా అన్నీ తక్కువే అడిగారు" అన్నాడు సుబ్బారావు

"లాంఛనాలే ఓ పాతిక వేలు అడుగుతారు. వీళ్ళు అంతా కలిపి ఐదు వేలకి కూడా అడగలేదు మనమే చూసుకుని ఇవ్వాలి" అంది అన్నపూర్ణ

"వాళ్ళడగకపోతే మనం ఇవ్వడం ఎందుకు?" అంది లక్ష్మి అని ఓ ముద్ద తిని మళ్ళీ అంది- "అసలు కట్నం ఎందు కివ్వాలేంటి?"

"కట్నం ఎందుకన్న ప్రశ్నకి నా దగ్గర సమాధానం లేదమ్మా కట్నం ఇవ్వకుండా పెళ్ళి కావడం జరిగే పనిలా లేదు. ఉద్యోగం లేని వాళ్ళ క్కూడా పది, పదిహేను వేలిస్తున్నారు "

"అక్కకి ఏం తక్కువని కట్నం ఇవ్వాలి?" అంది పార్వతి.

"ఇక్కడ ఎక్కువ తక్కువలు లేవు అయినా చిన్న పిల్లవు నీ కర్థం కాదులే ఈ సంగతి" అన్నాడు సుబ్బారావు.

"అది చిన్నపిల్ల సరే- నా కర్థమవుతుంది నాకు చెప్పు. నే నక్కడికి వెళ్ళి వాళ్ళ ఇంట్లో ఉండడానికి ఇస్తున్న డబ్బా ఇది?" అంది లక్ష్మి.

"పోనీ అలానే అనుకో" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

"ఒకవేళ నేను ఉద్యోగం చేస్తుంటే నా తిండికి, నా బట్టలకి నేనే సంపాదించుకుంటాను అప్పుడైతే కట్నం అడగరా వాళ్ళు?" అంది లక్ష్మి.

"ఎందుకడగరు? నువ్వు వీటి గురించి పట్టించుకోకు. అందుకే నీకు ఇవేం చెప్పకూడదు. కట్నం లేకుండా అసలు పెళ్ళిళ్ళు కావడం లేదు అందులోనూ ఇంతమంచి సంబంధం కట్నం పేరుతో వదిలేస్తామా?" అంది అన్నపూర్ణ

సుబ్బారావు అన్నాడు - "ఈ కట్నం గురించి ఇన్నేళ్ళు ఆలోచించినా నాకు అంతుపట్టలేదమ్మా లక్ష్మి. నాకూ కట్నం ఇవ్వడం, పుచ్చుకోడం ఇష్టం లేదు. అందుకే నేను తీసుకోలేదు అయితే మా చెల్లెలి పెళ్ళికి ఇవ్వక తప్పలేదు నేను కట్నం తీసుకోని సంబంధాలు వెతుకుతూ కొంతకాలం గడిపేసరికి, మా చెల్లెలే నాకు డబ్బియ్యడం ఇష్టంలేక తన జీవితాన్ని తగలెట్టేస్తున్నానన్నట్లు మాట్లాడింది.

మీరు ఆ మాట ఈ రోజు అనకపోవచ్చు. రెండు మూడేళ్ళు గడిచేసరికి నాన్న డబ్బు కోసం చూసుకుంటున్నాడని మీకూ అనిపించవచ్చు.

అసలు కట్నం ఎందికివ్వాలన్న ప్రశ్నకి నా దగ్గర జవాబు లేదు సరయిన కారణం లేకుండా ఉన్న ఈ వ్యవస్థ ఎలా ప్రబలిందో కానీ-

అందుకే ఎందుకన్న ప్రశ్న వదిలేద్దాం, ఇవ్వాలి. ఇద్దాం అయినా పాపం వాళ్ళు తక్కువే అడుగుతున్నారు కూడా!"

"పాపంలేదూ పుణ్యం లేదూ అడిగేది అడుగుతున్నారు. వాళ్ళు అడిగేదానికి మనం



ఒక్క పైసా ఎక్కువివ్వద్దు" అంది లక్ష్మి.

ఈరోజు వాళ్ళు - మనం అంటున్న లక్ష్మి, కొన్నాళ్ళకి వాళ్ళలో కలిసిపోతుందన్న భావం సుబ్బారావుకి స్పష్టంగా తెలిసిందే అది మనస్సు పొర లోపల ఎక్కడో బాధను కలిగించింది. ఆ విషయం అర్థం కాకుండా వాళ్ళూ మనం అంటోందిపిల్ల అన్న భావంతో పెదాలమీద చిన్న చిర్నవ్వు కూడా వచ్చింది ఎవరి దృష్టిలోనూ పడకుండా

★ ★ ★

లక్ష్మికి పెళ్ళయింది

పెళ్ళయిన మూడో రోజునే లక్ష్మి, లక్ష్మి వాళ్ళాయనా ('లక్ష్మీపతి' అనుకుందాం) హనీమూన్ కని బెంగుళూర్, మైసూర్ వెళ్ళారు కొత్త వాతావరణంలో, కొత్త అనుభవంతో లక్ష్మి ఆనందంగా గడిపేసింది మధ్య మధ్యలో అమ్మ, నాన్న, చెల్లెళ్ళు గుర్తుకొచ్చి దిగులుగా ఉన్నా- లక్ష్మీపతి కబుర్లతో, చిలిపి పనులతో మామూలుగా అయిపోయేది.

పెళ్ళయిన సంవత్సరంలో మూడు నాలుగు సార్లు పుట్టింటికి వెళ్ళింది. వెళ్ళిన ప్రతిసారీ వారం పది రోజులుండి లక్ష్మీపతిమీద బెంగపడినట్లు వెళ్ళిపోయేది.

రెండో సంవత్సరంలో పిల్లాడు పుట్టాడు.

లక్ష్మి పుట్టింటికి సంవత్సరానికోసారి రాసాగింది. అక్కడున్నపుడు కూడా లక్ష్మీపతి గురించి, అక్కడి ఇంటి గురించి ఎక్కువ చెప్పసాగింది- మధ్య మధ్యలో పార్వతి గుర్తు చేసినపుడు మాత్రం ఆపేస్తూ

లక్ష్మికి పెళ్ళయిన నాలుగేళ్ళకి సరస్వతికి పెళ్ళి కుదిరింది అదే విషయం ఉత్తరం రాశాడు సుబ్బారావు. పెళ్ళికి పదిహేను రోజులు ముందరే లక్ష్మినీ, లక్ష్మీపతినీ రమ్మని రాశాడు లక్ష్మీపతికి శెలవు దొరకలేదని పెళ్ళికి నాలుగు రోజుల ముందే వెళ్ళారు దంపతులు పిల్లాడితో




రాత్రి సుబ్బారావు, అన్నపూర్ణ ఇద్దరినీ కూర్చోబెట్టుకుని సరస్వతికి కుదిరిన సంబంధం గురించి చెప్పసాగారు.

రెండో అల్లుడు డాక్టర్ ఎక్కడా ఉద్యోగం చెయ్యడంలేదు కాని స్వంత నర్సింగ్‌హోమ్ నడుపుతున్నాడు. బాగా ఉన్నవాళ్ళే. పిల్లాడు బావుంటాడు నెమ్మదస్తుడని తెలిసిన వాళ్ళన్నారు. ఇవన్నీ చెప్పింది అన్నపూర్ణ.

"సరస్వతి అదృష్టం బావుంది" అన్నాడు లక్ష్మీపతి

"కట్నం ఎంత" మామూలుగా అడిగినట్లే అడిగింది లక్ష్మి

"అందరూ మీ ఆయనలాంటి వాళ్ళుండరమ్మా. వీళ్ళు కట్నం అరవై వేల రూపాయ లడిగారు అలానే లాంఛనాలు కూడా ఘనంగానే అడిగారు. పెళ్ళి చెయ్యడానికి కూడా చాలా నిబంధనలే పెడుతున్నారు" అన్నాడు సుబ్బారావు

"వెండి చెంబులూ, వెండి కంచాలూ - ఒకటేమిటి చాలా అడిగారు" అంది అన్నపూర్ణ

"అన్నింటికీ ఒప్పుకున్నారా?" అంది లక్ష్మి

"మీ సుఖమే మాక్కావలసింది కదా తల్లీ దేవుడి దయవల్ల డబ్బుకి లోటు లేదు మీ పెళ్ళపుడూ నేనేం తగ్గ మనలేదు ఇప్పుడూ అంతే" అన్నాడు సుబ్బారావు.

"మన కిచ్చింది ఇప్పటిదాంట్లో సగం కూడా ఉండవేమో" అన్నాడు సరదాగా లక్ష్మీపతి

"మీరడిగితే మనక్కూడా ఇంకా ఎక్కువ ఇచ్చి ఉండేవాళ్ళు మీ రడగలేదు కాబట్టి వాళ్ళివ్వలేదు" అంది లక్ష్మి.

"మీరలా అనుకుంటారేమోననే నలభై వేలు మనవడి పేరన డిపాజిట్ చేశాను" అన్నాడు సుబ్బారావు.

"అవేం వద్దండీ" అన్నాడు లక్ష్మీపతి.

"వాళ్ళు సరదాపడి ఇస్తానంటే వద్దనకూడదు మనం. మా నాన్నకి అందరూ ఒక్కటే" అంది లక్ష్మి

ఇప్పుడు లక్ష్మి అన్న 'వాళ్ళు' కొన్నేళ్లక్రితం 'మనం' అనీ, ప్రస్తుతం లక్ష్మి అంటున్న 'మనం' కొన్నేళ్ళక్రితం 'వాళ్ళు' అనీ సుబ్బారావుకి అనిపించి లోపల కొంచెం బాధగా అనిపించింది అయినా ఆడపిల్లలకుండే సామాన్య లక్షణం తెలిసిందే. తను అనుకున్నట్లే జరుగుతోందన్న భావంతో పెదాల మీదకి చిర్నవ్వు వచ్చింది ఎవ్వరికీ కనపడకుండా ●